క్లుప్తంగా

25న బీసీల ఆత్మగౌరవ సభ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘాల ప్రతినిధులు

కాకినాడ సిటీ: స్థానిక సూర్యకళామందిరంలో ఈ నెల 25న మధ్యాహ్నం రెండు గంటలకు బీసీల ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నట్టు ఆ వర్గం ప్రతినిధులు ప్రకటించారు. ప్రభుత్వ డ్రైవర్ల సంఘం భవనంలో శనివారం దీనికి సంబంధించి వాల్‌పోస్టర్‌ను వారు విడుదల చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అవుతున్నా బీసీల రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. సమావేశంలో రాష్ట్ర బీసీ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గూడూరు వెంకటేశ్వరరావు, బీసీ యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు చొల్లంగి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నింటా రాణించాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రసాదరెడ్డి

బోట్‌క్లబ్: విద్యతో పాటు ఇతర అంశాల్లోను ప్రతిభ చాటుకోవాలని రోటరీ యువజన మాసోత్సవ కమిటీ చైర్మన్ బి ప్రసాదరెడ్డి విద్యార్థులకు సూచించారు. రోటరీ గోల్డెన్‌జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్ మున్సిపల్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. క్లబ్ అధ్యక్షుడు జీవీ కృష్ణప్రకాష్, పోగ్రామ్ కో ఆర్డినేటర్ నల్లమిల్లి మాచారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల తనిఖీ



చెత్త తొలగింపు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ మహేష్‌కుమార్

కాకినాడ సిటీ: కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్‌కుమార్ రావిరాల శనివారం నగరంలోని ఇంద్రపాలెం బ్రిడ్జి నుంచి ప్రతాప్‌నగర్ రోడ్డు వరకు కెనాల్‌కు ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించే పనులను తనిఖీ చేశారు. కెనాల్ ఇరువైపులా చెత్తను ఆదివారం సాయంత్రానికి మొత్తం శుభ్రం చేయాలని పారిశుధ్య విభాగం అధికారులను ఆదేశించారు. ప్రజలందరూ అభివృద్ధిలో సహకరించాలని కోరారు. ఆయన వెంట ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి సోమవారం డయల్ యువర్ కమిషనర్

కాకినాడ సిటీ: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 వరకు డయల్ యువర్ కమిషనర్ నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్‌కుమార్ రావిరాల శనివారం తెలిపారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయానికి 0884–2357899 నంబర్‌కు కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. 10.30 నుంచి స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్య పొందడం ప్రాథమిక హక్కు

కాకినాడ రూరల్: బడి ఈడు పిల్లలు, కౌమర దశలో ఉన్నవారు విద్యను పొందడం ప్రాథమిక హక్కు అని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థితికి ఎదగాలని జిల్లా బాలల సంక్షేమాధికారి సీహెచ్ వెంకట్రావు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ పేదరికం, తదితర కారణాల వలన పిల్లలు విద్యాభ్యాసానికి దూరంగా ఉంటున్నారన్నారు. రత్నప్రసాద్, శ్రీనగేష్, రాజా తదితరులు పాల్గొన్నారు.

21న తిరుమలపాలేనికి తరలిరండి

కాకినాడ సిటీ: గోకవరం మండలం, తిరుమలపాలెంలో అంబేడ్కర్ విగ్రహం తొలగింపు ఘటనలో దళితులపై దాడిని ఖండిస్తూ శనివారం స్థానిక సుందరయ్య భవన్‌లో దళిత, వామపక్ష, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ నెల 21న తిరుమలపాలేనికి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు తరలిరావాలని పిలుపునిచ్చాయి. తిరుమలపాలెం ప్రజలకు మద్దతు పలకాలని రౌండ్‌టేబుల్ సమావేశం నిర్ణయించింది. సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు తాటిపాక మధు, జె.వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

చీకటింట కంటి వెలుగు

- ముదిమిలో ముచ్చటైన ప్రయోజనం
- అంధకార జీవితానికి దారిచూపారని సీఎం జగన్‌కు వృద్ధుల కృతజ్ఞతలు



కంటి వెలుగు పరిధిలో స్క్రీనింగ్ పరీక్షలు



కాకినాడ క్రైం: అంధత్వాన్ని అదిమేసి కంటికి వెలుగునిచ్చి పేదింట వెలుగులు నింపాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం నెరవేరుతోంది. కంటి వెలుగు కార్యక్రమం ద్వారా వయసు మళ్లిన అవ్వాతాతల జీవితాలు నిత్య సంతోషాన్ని సంతరించుకున్నాయి. మనవళ్లు, మునిమనవళ్ల ఆటపాటలు చూస్తూ వెలుగులు నిండిన కొత్త కళ్లు ఆనందంతో చెమ్మగిల్లుతున్నాయి. వయసు మళ్లిన వృద్ధాప్యంలోనూ మరో ప్రపంచాన్ని చూస్తున్నాయి. 2020 ఫిబ్రవరిలో ప్రారంభమైన ఈ కార్యక్రమం నగరం పరిధిలో జీజీహెచ్ వేదికగా కొనసాగుతోంది. మూడేళ్ల వ్యవధిలో వేలాది జీవితాల్లో కంటి చూపును ప్రసాదించింది.

ఏం చేస్తారు....

ఈ కార్యక్రమంలో భాగంగా 60 ఏళ్లు పైబడ్డ వారికి క్యాటరాక్ట్ సర్జరీలు చేసి కంటి శుక్లాలు తొలగిస్తారు. వాటి స్థానంలో ఇంట్రా ఆక్యులర్ లెన్స్ ఏర్పాటు చేస్తారు. శస్త్రచికిత్సలే కాక కళ్లద్దాలూ ఉచితంగా అందజేస్తున్నారు.

రోజుకు సగటున ఆరు శస్త్ర చికిత్సలు

స్థానిక జీజీహెచ్‌లో రోజుకి సరాసరి ఆరు శస్త్రచికిత్సలు చేస్తున్నట్లు ఆప్తల్మాలజీ హెచ్‌వోడీ డాక్టర్ రమాభారతి తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ప్రక్రియలో ఒక రోజు స్క్రీనింగ్, రెండో రోజు శస్త్రచికిత్స, మూడో రోజు పరిశీలన చేస్తామని ఆమె అన్నారు.

శిబిరాల ద్వారా గుర్తింపు

నగరంలోని పీహెచ్‌సీల పరిధిలో పారామెడికల్ అప్తాల్మిక్ ఆఫీసర్లు నిర్వహించే ప్రత్యేక శిబిరాల ద్వారా రోగుల్లో అంధత్వాన్ని గుర్తిస్తారు. ముందస్తుగా శుక్లాలు గుర్తిస్తే అంధత్వం ముదిరిపోకుండా చర్యలు తీసుకోవచ్చు.

మూడేళ్లలో 40 వేల మంది..

గడచిన మూడేళ్లలో నగర పరిధిలో సుమారు 40 వేల మందికి కంటి వెలుగు సేవలందించారు. 25,126 మందికి స్క్రీనింగ్ నిర్వహించారు. వీరిలో 22 వేల మందికి శస్త్రచికిత్సలు చేశారు. 11 వేల మందికి కళ్లద్దాలు అందించారు. ఈ సేవలన్నీ కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రితో పాటు కిరణ్ కంటి ఆసుపత్రి వంటి ఎన్‌జీవో అనుబంధ ఆసుపత్రుల్లో పూర్తి ఉచితంగా చేస్తున్నారు.

మరిన్ని కేసులు రావాలి



శిబిరాల ద్వారా మరిన్ని కేసులు సిఫార్సు చేయాల్సి ఉంది. అవి నేరుగా ఎన్‌జీవో అనుబంధ ఆసుపత్రులకే కాక, ప్రభుత్వ ఆసుపత్రికీ రిఫర్ కావాలి. ఆ దిశగా పారామెడికల్ అప్తాల్మిక్ ఆఫీసర్లు చొరవ తీసుకోవాలి. జీజీహెచ్‌లో సీనియర్ వైద్య నిపుణురాలు, హెచ్‌ఓడీ డాక్టర్ రమాభారతి ఆధ్వర్యంలో శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. శస్త్రచికిత్స అనంతరం ప్రభుత్వ ఆర్థిక సాయం అందిస్తుంది. శుక్లాలను నిర్లక్ష్యం చేస్తే కంటి చూపు పూర్తిగా మందగించే ప్రమాదం ఉంది.

డాక్టర్ వెన్న పద్మ దీపిక, కంటి వైద్య నిపుణురాలు, పీఓ, జిల్లా అంధత్వ నివారణ సంస్థ

నా మనవళ్లను చూడలేననుకున్నా



కొన్నేళ్లుగా బాధపడుతున్న ఆ కంటి చూపు సమస్య కేవలం పావుగంట వ్యవధిలో మటుమాయమైంది. వయసు రీత్యా కంటి చూపు సమస్యతో బాధపడుతున్న నేను రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కంటి వెలుగు పథకం పరిధిలో కేటరాక్ట్ సర్జరీ చేయించుకున్నాను. కళ్లకి కేవలం పావుగంట మాత్రమే ఆ ప్రక్రియ చేశారు. కొన్నేళ్ల నా చీకటి జీవితంలో నిమిషాల్లో వెలుగు నిండింది. నా బిడ్డలు, మనవళ్లని చూసి కన్నీళ్లొచ్చాయి. నా మనవళ్లని చూడలేనేమో అనుకున్నా. కంటి వెలుగు ద్వారా నా కష్టం తీరి, నా జీవితంలో వెలుగు నిండింది.

– బూసి విజయకుమారి, లబ్ధిదారు

మళ్లీ చూస్తున్నా



కంటి వెలుగు పరిధిలో శుక్లాల శస్త్రచికిత్స పూర్తి ఉచితంగా చేయించుకున్నా. నొప్పి లేని శస్త్రచికిత్స అది. కొన్నేళ్ల క్రితం మధుమేహానికి గురయ్యాను. శుక్లాల సమస్య తలెత్తింది. నాటి నుంచి కంటి చూపు మందగిస్తూ వచ్చింది. ఒక దశలో కంటి చూపు పూర్తిగా కోల్పోయా. మా ఏఎన్‌ఎం శకుంతల సలహాతో కంటి వెలుగు ద్వారా ప్రయోజనం పొంది శస్త్రచికిత్స చేయించుకున్నాను. ఇప్పుడు ముందరి కంటే స్పష్టంగా చూడగలుగుతున్నా.

– కరుపోతు రంగబాబు, లబ్ధిదారుడు

మత్స్యకారులకు అండగా ముఖ్యమంత్రి జగన్



పీఎంఎంఎస్‌వై పథకం కింద లబ్ధిదారులకు వాహనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- పీఎంఎంఎస్‌వైని సద్వినియోగం చేసుకోవాలి
- సబ్సిడీపై వాహనాల పంపిణీ

కాకినాడ రూరల్: మత్స్యకారులకు అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద శనివారం ఉదయం నియోజకవర్గ పరిధిలోని ముగ్గురు లబ్ధిదారులకు రూ.60.67 లక్షల విలువైన మూడు సీడ్ ట్రాన్స్‌పోర్టు వాహనాలను మత్స్యశాఖ అధికారుల సమక్షంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కొవ్వూరుకు చెందిన గరగ వీరకుమార్‌కు రూ.22.9 లక్షలు విలువైన వాహనం, కరప మండలం కొంగోడుకు చెందిన తోటకూర దుర్గా ప్రసాద్‌కు రూ.24.46 లక్షలు విలువైన, మేడిశెట్టి దుర్గా ప్రసాద్‌కు రూ.13.29 లక్షల విలువైన వాహనాలు అందజేశారు. పీఎంఎంఎస్‌వై పథకం ద్వారా లబ్ధిదారులకు 40 శాతం రాయితీపై వాహనాలు అందజేశామన్నారు. అదే ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం రాయితీ లభిస్తుందన్నారు. మిగిలిన వాటాను లబ్ధిదారులు భరించాల్సి ఉంటుందన్నారు. రాయితీ సొమ్మును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయన్నారు. రూరల్ ప్రాంతం మత్స్య సంపదకు నిలయం కావడంతో ఇక్కడ నుంచి లైవ్ ఫిష్ ట్రాన్స్‌పోర్టేషన్‌కు ఆక్సిజన్‌తో కూడిన వాహనాలను ప్రోత్సహించాలని సీఎం జగన్ చెప్పడంతో వాటి మంజూరుకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. మత్స్యశాఖ ఏడీ కరుణాకరరావు, రూరల్ ఎఫ్‌డీఓ సీహెచ్.ఉమామహేశ్వరరావు, ఎఫ్‌డీఓలు ఆర్.నూకరాజు, కె.ప్రకాష్‌రావు, డాక్టరు జి.గోపి, వి.అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మం బలీయమైనది

- ధర్మార్థకామమోక్షాలే ఈ వ్యవస్థకు పునాదులు
- ప్రవచనకర్త గరికిపాటి



నలదమయంతి చరిత్రను ప్రవచిస్తున్న గరికిపాటి నరసింహారావు

కాకినాడ కల్చరల్: హిందూ ధర్మం చాలా బలీయమైనది. ఇంతటి నియమబద్ధ వ్యవస్థ ప్రపంచంలో మరెక్కడా లేదని పద్మశ్రీ డాక్టర్ గరికిపాటి నరసింహారావు అన్నారు. స్థానిక సూర్యకళామందిర్‌లో సరస్వతీగాన సభ ఆధ్వర్యంలో నలదమయంతి చరిత్రపై ఆయన ప్రవచనాలు చేస్తున్నారు. వారి చరిత్రను ఆధునిక కాలానికి ఎలా అన్వయించవచ్చో శనివారం నాటి ప్రవచనంలో వివరించారు. సంతృప్తి, వాత్సల్యం, దంపతులు ప్రేమతో జీవించాలని అన్నారు. భర్త శోకంలో ఉన్నప్పుడు భార్య తోడుండి ఉపశమనం కలిగించాలని అన్నారు. ధార్మర్థకామమోక్షాలు మన వ్యవస్థకు పునాదులని అన్నారు. భార్యభర్తల అనుబంధం చాలా పవిత్రమైనదని, నలుడు పుష్కరుడితో పాచికలు ఆడి తన సంపదను, రాజ్యాన్ని కోల్పోయిన ఘట్టాలను, సర్వం కోల్పోయిన దమయంతి తన పిల్లలను రథసారథితో తన తండ్రి రాజ్యానికి పంపే సమయంలో ఆమె పడిన వేదనను, దయయంతి నిద్రపోతున్నప్పుడు కలి ప్రభావంతో నలుడు ఆమెను విడచి వెళ్లిన ఘట్టాలను, ఇన్ని కష్టాలను ఎదుర్కొని మరీ తన జీవితాన్ని సరిదిద్దుకున్న దమయంతిని మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని వివరించారు. పెళ్ళైన సంవత్సరంలో భార్యభర్తల మధ్య అన్యోన్యత బలపడుతుందన్నారు. 'ఇగో' తో ప్రవర్తించిన వారితో 'యూ గో' అనడమే సరియైన సమాధానమని ఆయన చమత్కరించారు. నల దమయంతుల వలె భర్తకు భార్యతగిన సలహాలు ఇవ్వాలి తప్ప అన్నింటికి తందాన తాన అనకూడదని చలోక్తులతో వివరించారు. గాన సభ అధ్యక్షుడు కెవీఎస్ ఆంజనేయమూర్తి, కార్యదర్శి పేపకాయల రామకృష్ణ, ఉపాధ్యక్షుడు ఎల్.సత్యనారాయణ్, మునుగంటి వెంకట్రావు, శ్రీరామచంద్రమూర్తి, పెద్దాడ సూర్యకుమారి, చావలి సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- నడకుదురులో గడప గడపకూ..



ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: సంక్షేమ పథకాల ద్వారా ప్రజల మన్ననలు పొందిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి ఆశీర్వచనాలు అందించాలని ఎమ్మెల్సీ కురసాల కన్నబాబు కోరారు. కరప మండలం నడకుదురు సచివాలయం–2 పరిధిలో శనివారం గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి అక్కడే ఉన్న అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం ద్వారా నాలుగేళ్లలో పొందిన లబ్ధికి సంబంధించి వివరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నడకుదురు గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామంలో సమస్యలను పరిష్కరించేందుకు అధికారులకు ఆదేశాలు ఇచ్చామని, రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ సమస్యల వంటివి పరిష్కరించడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, అధికారులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

మా దారి రహదారి..



విద్యుత్‌నగర్ - ఐడియల్ కళాశాల రోడ్డు మధ్యలో తిరుగుతున్న ఆవులు

బోట్‌క్లబ్: ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 15కు పైగా ఆవులు రోడ్డు మధ్యలో తిష్టవేయడంతో ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. స్థానిక విద్యుత్‌నగర్ ఐడియల్ కళాశాల రోడ్డులో ఆవులు తరచూ ఇలాగే తిష్ట వేస్తున్నాయి. కార్పొరేషన్ అధికారులు ఎంత హెచ్చరించినా పశువుల యజమానుల్లో మార్పు రావడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆత్మరక్షణకు తైక్వాండో




డెహ్రాడూన్‌లో తైక్వాండో పోటీల్లో పాల్గొన్న జిల్లా క్రీడాకారులు (ఫైల్)

- జాతీయస్థాయిలో మెరిసిన జిల్లా క్రీడాకారులు
- రజిత, కాంస్య పతకాలు సాధించిన 'తూర్పు' తేజాలు

నాగమల్లితోటజంక్షన్(కాకినాడ సిటీ): తైక్వాండో క్రీడగానే కాక ఆత్మరక్షణకు ప్రతి ఒక్కరికి అవసరమైన విద్య. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వేలాదిగా ఈ క్రీడలో శిక్షణ పొందుతున్నారు. జిల్లా క్రీడాకారులు డెహ్రాడూన్‌లో ఈ నెల 12 వరకు జరిగిన 38వ సీనియర్ జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో రాష్ట్రం తరపున వివిధ విభాగాల్లో 5 రజిత పతకాలు, ఒక కాంస్య పతకం సాధించి ఆదర్శంగా నిలిచారు. విజేతలు, కోచ్ బి.అర్జునరావు వారి అభిప్రాయాలు సాక్షితో పంచుకున్నారు.

పతకాలు సాధించడం గర్వంగా ఉంది



జిల్లా క్రీడాకారులు 38వ సీనియర్ జాతీయస్థాయి తైక్వాండో పోటీలలో 5 రజిత, 1 కాంస్య పతకం సాధించడం జిల్లాకు గర్వకారణం. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించడం వల్లే ఈ విజయం సాధ్యమైంది. చదువుతోపాటు క్రీడల్లోనూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలి.

అర్జునరావు, తైక్వాండో కోచ్, కాకినాడ

జాతీయస్థాయిలో ఇదే మొదటి మెడల్



నా పేరు గుబ్బల మేరీ గోల్డ్. చిన్నతనం నుంచి తైక్వాండో అంటే ఇష్టం. 12 ఏళ్లుగా తైక్వాండోలో శిక్షణ పొందుతున్నాను. జాతీయస్థాయి పతకం సాధించడం ఇదే మొదటిసారి. 73 కేజీల పైబడిన విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాను. ఇప్పటి వరకు వివిధ స్థాయిల్లో 6 పతకాలు సాధించాను. మంచి ఉద్యోగంలో స్థిరపడాలన్నది నా లక్ష్యం. బీపీఈడీ పూర్తయింది. డీఎస్సీకి సిద్ధమవుతున్నాను.

స్పోర్ట్స్ కోటాలో టీచర్ అవుతా



నా పేరు బి.అఖిల. బిఇడీ పూర్తి చేశాను. డీఎస్సీకి సిద్ధమవుతున్నా. గతంలో తైక్వాండోలో జాతీయ స్థాయిలో రజత పతకం సాధించా. ఇప్పుడు 38వ సీనియర్స్ తైక్వాండోలో రెండోసారి సిల్వర్ మెడల్ సాధించా. స్పోర్ట్స్ కోటాలో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించడం నా లక్ష్యం.

రోజుకు రెండు గంటల సాధన



నా పేరు జి.తేజ. సీనియర్ తైక్వాండోలో కాంస్య పతకం సాధించా. చాలా సంతోషంగా ఉంది. నిత్యం రెండు గంటలు తైక్వాండో సాధన చేస్తాను. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవ్వడం నా లక్ష్యం.

జీజీఎంపీ పనులను వేగంగా పూర్తిచేయండి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జిల్లాలో గడపగడపకు మన ప్రభుత్వం (జీజీఎంపీ)లో భాగంగా మంజూరు చేసిన పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె కలెక్టర్ కార్యాలయంలో ప్లానింగ్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, ఏపీ ఈపీ డీసీఎల్, సోషల్ వెల్ఫేర్, వివిధ మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లతో సమీక్షించి పనుల ప్రగతిని తెలుసుకున్నారు. జిల్లాలో ప్రతి గ్రామ, వార్డు సచివాలయం పరిధిలో డ్రైనేజీలు, సీసీ రోడ్లు, సామాజిక భవన నిర్మాణాల నిమిత్తం రూ.20 లక్షలు మంజూరయ్యాయని. ఇంకా ప్రారంభం కాని పనులను రానున్న వారం రోజుల్లో గ్రౌండింగ్ పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సీపీవో పి.త్రినాథ్, సోషల్ వెల్ఫేర్ డీడీ డీవీ రమణమూర్తి, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్‌ఈ పి.సత్యకుమారి, ఏపీఈపీడీసీఎల్ ఈఈ ప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్లు, వివిధ పురపాలక సంఘాల కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చలివేంద్రం నిర్వహణ అభినందనీయం



చలివేంద్రం ముగింపు కార్యక్రమంలో పాల్గొని మజ్జిగను అందజేస్తున్న జేసీ ఇలక్కియ

కాకినాడ సిటీ: రాగిరెడ్డి వెంకట జయరాం కుమార్, కాకినాడ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏప్రిల్ నుంచి శనివారం వరకు 55 రోజుల పాటు చలివేంద్రాన్ని కొనసాగించడం అభినందనీయమని జేసీ ఎస్.ఇలక్కియ పేర్కొన్నారు. చలివేంద్రం ముగింపు సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని కార్యాలయాలకు వచ్చేవారి దాహార్తి తీర్చడానికి మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. చలివేంద్రం నిర్వహణకు చొరవ చూపిన మంగ వెంకట శివరామకృష్ణను ఆమె అభినందించారు. 55 రోజుల పాటు జర్నలిస్టులు చలివేంద్రాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందని కౌడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి అన్నారు. ఇందుకు సహకరించిన రాష్ట్ర బీసీ సంక్షేమశాఖా మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీ గీత, ఎమ్మెల్యేలు ద్వారపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు తదితరులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

కాకినాడలో ట్రాఫిక్ మళ్లింపు

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో ఆదివారం సాయంత్రం జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ వారాహి యాత్ర, బహిరంగ సభ నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లిస్తున్నట్టు సర్పవరం సీఐ మురళీకృష్ణ తెలిపారు. సర్పవరం జంక్షన్ మీదుగా సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు భానుగుడి జంక్షన్ మీదుగా వచ్చే వాహనాలను నాగమల్లి జంక్షన్ నుంచి ఆర్టీఓ కార్యాలయం రోడ్డు మీదుగా గంగరాజునగర్ టీ జంక్షన్, వలసపాకల మీదుగా ఏడీబీ రోడ్డుకు మళ్లించామన్నారు. అలాగే పిఠాపురం వైపు నుంచి సర్పవరం జంక్షన్ మీదుగా వచ్చే వాహనాలను ఏడీబీ రోడ్డు నుంచి కోరమాండల్ మీదుగా వలసపాకల నుంచి గంగరాజు నగర్ టీ జంక్షన్ మీదుగా ఆర్టీఓ ఆఫీసు రోడ్డుకు మళ్లించనున్నట్టు తెలిపారు. మాధవపట్నం సెంటర్, పనసపాడు నుంచి వచ్చే వాహనాలను గైగోలుపాడు జంక్షన్ మీదుగాను, వలసపాకల, వాకలపూడి నుంచి వచ్చే వాహనాలను ఆర్టీఓ ఆఫీసు రోడ్డుకు మళ్లిస్తామన్నారు. పిఠాపురం నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను అచ్చంపేట జంక్షన్ మీదుగా బీచ్ రోడ్డు నుంచి కోరమాండల్ మీదుగా ఆర్టీఓ ఆఫీసు రోడ్డుకు, అలాగే కాకినాడ నుంచి వెళ్ళే బస్సులను కోకిల సెంటరు, ఆర్‌ఎంసీ మెన్స్ హాస్టల్ మీదుగా వలసపాకల మీదుగా ఏడీబీ రోడ్డుకు మళ్లిస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కాకినాడ రూరల్: మండలంలోని చీడిగ గ్రామ పరిధిలోని పొలంలో చింత చెట్టుకు ఉరి వేసుకుని రామచంద్రపురం గ్రామానికి చెందిన వ్యాన్ డ్రైవర్ మహ్మద్ ఇంతియాజ్ బేగ్ (44) శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంద్రపాలెం పోలీసులు తెలిపిన వివరాల మేరకు బేగ్ శుక్రవారం ఇంటి నుంచి వచ్చి అనారోగ్యం, అప్పులు బాధతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని కుటుంబ సభ్యులు చెప్పినట్టు ఎస్సై నాగార్జున తెలిపారు. మృతుడి భార్య ఎండీ నతీషా బేగ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.